# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

teluguprabha.net

-TeluguPrabha

@TeluguPrabhaofficial

TS వైబ్రెంట్ ఎడిషన్ 1 pm

ఆదివారం 6-8-2023


## అభివృద్ధిలో పరుగులు తీస్తున్నాం

– ప్రధాన మంత్రి మోదీ



**న్యూఢిల్లీ,ఆగస్ట్6(తెలుగుప్రభ):**

ప్రస్తుతం మన దేశం అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అన్నారు. అమృత్ భారత్ పథకం కింద దేశంలోని 508 రైల్వే స్టేషన్ల పునరభివృద్ధి పనులకు ప్రధాని వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైల్వే స్టేషన్ల వద్ద షాపింగ్ కాంప్లెక్సులు, గేమింగ్ జోన్‌లు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. వీటి ఏర్పాటు అనంతరం ఈ రైల్వే స్టేషన్లు మల్టీమోడల్ హబ్స్‌గా అభివృద్ధి చెందనున్నాయన్నారు. తెలంగాణలో 21 రైల్వే స్టేషన్లను రూ. 894.09 కోట్లతో, ఆంధ్రప్రదేశ్‌లో 18 రైల్వే స్టేషన్లను రూ.453.50 కోట్లతో రైల్వేశాఖ అభివృద్ధి పనచనుందని పేర్కొన్నారు.

సండే స్పెస్

# శభాష్ కేటీఆర్



### అసెంబ్లీలో భళా అనిపించిన వర్కింగ్ ప్రెసిడెంట్

**హైదరాబాద్, ఆగస్ట్6(తెలుగుప్రభ):**

మూడు రోజుల అసెంబ్లీ సమావేశాల్లో మునిసిపల్ మంత్రి కేటీఆర్ ప్రసంగిస్తున్న తీరు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. పదునైన వ్యాఖ్యలతో, పరిస్థితుల ఫొటోలతో సభలో వ్యవహరిస్తున్న వైనం ఆయన ఇమేజ్‌ను మరింత పెంచింది. బాధ్యత కలిగిన నేతలు అసెంబ్లీ వంటి సమావేశాల్లో పాల్గొనేటప్పుడు ఎలా ఉండాలో కేటీఆర్ ద్వారా తెలిస్తే, ఎలా ఉండకూడదో ప్రతిపక్ష నేతలు తెలిపారంటూ పరిశీలకులు వ్యాఖ్యానించారు. 'అచట పుట్టిన చిగురు కొమ్మయినా చేవ' అన్న మనుచరిత్రలోని పంక్తుల్ని గుర్తు చేశాడో సాహితీమిత్రుడు. కేసీఆర్ వారసునిగా అటు రాజకీయాలతోపాటు ఇటు ప్రసంగాల్లోనూ ొసరైనోడు అనిపించుకున్నాడు. తన వాగ్ధాటితో ప్రతిపక్షాలకు నోట మాట రాకుండా చేశారు.

తన నియోజకవర్గం సిరిసిల్లలో షూటింగ్ జరిగిన 'బలగం' సినిమాను ప్రస్తావించినా పల్లెలు పచ్చగా మారిన తీరు వివరించారు. కథలు, కవిత్వం, సామెతలు సైతం సందర్భానుసారం వాడి ఎదుటి వారి మొఖం మాడిపోయేలా చేశారు. పిల్లలకు ఎక్కాలు రావు.. కాంగ్రెస్‌కు లెక్కలు రావు అంటూ రాష్ట్రంలో తమ హయాంలో జరిగిన అభివృద్ధి కాంగ్రెస్ నాయకులకు తెలియదంటూ చురకలంటించారు. వరద నష్టం మీద ప్రసంగించిన శ్రీధర్‌బాబు, సర్పంచ్‌ల కష్టాల గురించి మాట్లాడిన భట్టి విక్రమార్కలవి గాలి మాటలని స్పష్టం చేయగలిగారు. వారు కనీస హోమ్‌వర్క్ చేయకుండా సభలో కొచ్చారని ప్రజలర్థం చేసుకునేలా చేయగలిగారు.

#### బుల్లెట్ దిగిందా.. లేదా ?

దున్న ఇద్దాసు 'మడుగు సింగారం మత్స్యానికే ఎరుక.. కడలకడల తిరిగే కప్పకేమెరుక' ? నుంచి గోరటి ఎంకన్న 'పల్లె కన్నీరు పెడుతుందో' దాకా కవిత్వాన్నీ సందర్భానుసారం ప్రయోగించారు. ఊరు దరిద్రంగా ఉందని యాభైయ్యేళ్లు అధికారం చెలాయించిన వారు చెబితే అందుకు కారకులెవరు? 1956లో తెలంగాణ, ఆంధ్రకు బలవంతంగా పెళ్లి చేసిందెవరంటూ ఎప్పుడొచ్చామన్నది కాదు.. బుల్లెట్ దిగిందా అన్నదే కావాల్సింది అంటూ ప్రతిపక్షాలకు కనీసం గొంతెత్తే అవకాశం లేకుండా చేశారు. కేటీఆర్ ధాటికి 'పాపం భట్టి విక్రమార్క' అనుకున్నారు సామాన్యులు.

#### కాంగ్రెస్ కళ్లు తెరిచేలా

అంతేకాదు.. గాంధీభవన్‌లో ఏం జరుగుతుందో తెలుసుకొని జాగ్రత్తగా ఉండాలని, మీ వెనుక గోతులు తవ్వుతున్నారంటూ సీఎల్పీ లీడర్ భట్టికి సూచించడం ద్వారా ఎదుటి పార్టీలో ఏం జరుగుతుందో కూడా కళ్లకు కట్టారు. కర్నాటకలో వచ్చిన అధికారంతో ఇక్కడా సీఎం పదవి కోసం పగటి కలలు కంటూ పదిమంది పోటీ పడుతున్నారంటూ కాంగ్రెస్ పరిస్థితిని వివరించారు. గెలిచిన నలుగురు ఇక్కడుంటే ఓడిన వారు అక్కడ టిక్కెట్లు డిసైడ్ చేస్తున్నారంటూ పార్టీ పరిస్థితిని ఎండగట్టారు. ఒక దగ్గర కూర్చోలేని నలుగురు నాలుగుకోట్ల మందిని పాలిస్తామంటున్నారని ఎద్దేవా చేశారు.

#### గెలుపు మాదే

శిథిలం నుంచి శిఖరం వైపు, విధ్వంసం నుంచి వికాసం వైపు, అగాథం నుంచి ఆకాశం వైపు పయనిస్తున్నది తామేనని, ఇంటింటికీ నీళ్లే కాదు వచ్చే ఎన్నికల్లో ప్రతిపక్షాలకు మూడు చెరువుల నీళ్లు తాగించేదీ తామేనంటూ గెలుపు ధీమాను వ్యక్తం చేశారు. అంతేకాదు.. నాలుగునెలల్లో రానున్న ఎన్నికల గురించి మాత్రమే ఆలోచిస్తున్నది వారైతే, రాబోయే తరాల గురించి ఆలోచిస్తున్న స్టేట్స్‌మన్ తమ నాయకుడంటూ తామెంత కమిట్‌మెంట్‌తో పనిచేస్తున్నదీ, ప్రతిపక్షాలకు అది లేకపోవడాన్నీ బట్టబయలు చేయగలిగారు. ఇలా చెప్పుకుంటూ పోతే కేటీఆర్ టైమింగ్‌కు, సమయస్ఫూర్తికి అంతే లేదు. అన్నింటా తనకున్న అవగాహనను సైతం ఛలోక్తులతో వెల్లడించిన కేటీఆర్ సెషన్‌ను మొత్తం ఒంటిచేత్తో నడిపించారు.

### కేటీఆర్ వ్యంగ్యాస్త్రాల్లో కొన్ని..

– కాంగ్రెస్ ఇప్పుడు ఎక్స్‌పైర్డ్ మెడిసిన్. పనికి రాదు.

– భట్టి అన్నా.. మీరక్కడే ఉండండి.. ప్రతిపక్షంలో

– నాలుగు నెలల తర్వాత మీదే అధికారం అంటున్నారు. మరి మమ్మల్నెందుకు అడుగుతున్నారు ?

– గతంలో ఏది పడితే అది ఫ్రీ అన్న 'బండి' నడవక షెడ్డుకు పోయింది.

– అక్బర్‌సాబ్ ! మీరప్పుడు యువకులు. ఇప్పుడు కాదు. నేను కూడా!

ఇంటింటికి నల్లా నీరిచ్చిన మొదటి రాష్ట్రమేది ?

రైతులకు ఇరవైనాలుగు గంటల ఉచితవిద్యుత్ ఇస్తున్నదెవరు?

ఐటీ ఉద్యోగాలు ఎక్కువగా ఇచ్చిన రాష్ట్రమేదీ ?

ప్రపంచంలో పెద్ద లిఫ్ట్‌రిగేషన్‌ను సాధ్యం చేసిందెవరు ?

దేశంలోనే అత్యధిక తలసరి ఆదాయం కలిగిన రాష్ట్రమేదీ?

అన్ని ప్రశ్నలకూ ఒకే సమాధానం

– తెలంగాణ అని చెప్పించారు.

## 'అసెంబ్లీ' పొడిగింపు ?

'ఆర్టీసీ బిల్లు' కోసం..

**హైదరాబాద్,ఆగస్ట్6(తెలుగుప్రభ):**

బీఏసీ నిర్ణయం మేరకు రాష్ట్ర శాసనసభ సమావేశాలకు నేటితో తెరపడనుంది. కానీ సమావేశాల్ని పొడిగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసే అంశం పై ఆర్టీసీ ఉన్నతాధికారులకు రాజ్‌భవన్ నుంచి పిలుపు అందింది. వారితో ఆమె సమావేశం జరిపాక, నిర్ణయం తీసుకొని బిల్లుపై సంతకం చేస్తారో లేదో తెలియదు. సంతకం చేసేందుకు సిద్ధమైనా అందుకు ఎంత సమయం పట్టనుందో తెలియదు. ఈ నేపథ్యంలో గవర్నర్ సంతకం చేస్తే ఆర్టీసీ ఉద్యోగుల ప్రయోజనం కోసం బిల్లును వెంటనే ఆమోదించేందుకు సమావేశాల్ని పొడిగించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ప్రస్తుత ప్రభుత్వానికి ఇవే చివరి సమావేశాలు కానుండటంతో ప్రభుత్వం ఇందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది.

## వచ్చే అసెంబ్లీలో ఉంటానో.. లేదో ?

– గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్



**హైదరాబాద్,ఆగస్ట్6(తెలుగుప్రభ):**

పార్టీనుంచి సస్పెన్షన్‌కు గురైన గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ వచ్చే ఎన్నికల్లో తాను అసెంబ్లీలో ఉంటానో, లేదో అని వ్యాఖ్యానించారు. ఇంటా, బయటా కూడా తాను అసెంబ్లీకి రావద్దనే కోరుకుంటున్నారంటూ వేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రశేఖరరావు అసెంబ్లీ సాక్షిగా ధూల్‌పేటలో పర్యటిస్తానని మాట ఇచ్చినా పర్యటించలేదన్నారు. ధూల్‌పేటను అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చి మాట తప్పారన్నారు. అసెంబ్లీకి తాను వచ్చినా, రాకపోయినా ధూల్‌పేటను అభివృద్ధి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా శాసనసభలో స్పీకర్‌ను కోరారు. మహమ్మద్ ప్రవక్తపై రాజాసింగ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యల కారణంగా బీజేపీ ఆయనను సస్పెండ్ చేయడం తెలిసిందే. ఎంతోకాలం గడిచినప్పటికీ తన సస్పెన్షన్‌ను పార్టీ ఎత్తివేయక పోవడం.. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షునిగా బండి సంజయ్ స్థానంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి రావడం తదితర పరిణామాలతో రాజాసింగ్ అసంతృప్తితో, నిర్వేదంలో ఉన్నట్లు ఆయన అభిమానులు చెబుతున్నారు. సస్పెన్షన్ కారణంగా పార్టీ తరపున అసెంబ్లీలో తన వాణిని వినిపించలేక పోతున్నారంటున్నారు.



## తెలంగాణ అప్పులు రూ.3.14 కోట్లు

కాగ్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్6(తెలుగుప్రభ):**

తెలంగాణ రాష్ట్రం రూ.314 కోట్ల అప్పుల్లో ఉన్నట్లు కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)నివేదిక పేర్కొంది. రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై కాగ్ రూపొందించిన నివేదికను రాష్ట్రప్రభుత్వం ఆదివారం శాసనసభలో ప్రవేశపెట్టింది. 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఈ నివేదికలో వందరోజుల పాటు ప్రభుత్వం రూ.22,669 కోట్ల ఓవర్‌డ్రాఫ్ట్‌కు వెళ్లినట్లు పేర్కొంది. 2020–21 ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ లోటు రూ.9335 కోట్లని వెల్లడించింది. కేంద్రం నుంచి అందాల్సిన గ్రాంట్లు 44 శాతం తగ్గాయని తెలిపింది.



## నిర్లక్ష్యంతో నవజాత శిశువు మృతి

నిలోఫర్ ఆస్పత్రిలో

**హైదరాబాద్, ఆగస్ట్6(తెలుగుప్రభ):**

ఒకరి నిర్లక్ష్యం కారణంగా ఓ పసికందు మృతి చెందిన విషాద సంఘటన నిలోఫర్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. ఓ పేషెంట్ అటెండర్ మీద పడటంతో ఎమర్జెన్సీ వార్డులోని నవజాత శిశువు మృతి చెందినట్లు విశ్వసనీయంగా తెలిసింది. సెక్యూరిటీ సిబ్బంది మీడియాను లోనికి అనుమతించలేదు. అసెంబ్లీ సమావేశాల తరుణంలో విషయం బయటకు పొక్కితే పెద్ద దుమారం చెలరేగుతుందని భావించిన ఆస్పత్రి అధికారులు గుట్టుచప్పుడుకాకుండా శిశువు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం .



## 270 కేజీల నల్లబెల్లం స్వాధీనం

**నాగర్‌కర్నూల్, ఆగస్ట్6(తెలుగుప్రభ):**

జిల్లాలోని అచ్చంపేట మండలంలోని కొన్ని గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు జరిపిన దాడుల్లో తొమ్మిది సంచుల్లో 270 కేజీల నల్లబెల్లం, 40 కిలోల పట్టిక ఉన్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. రాయచడి, చెన్నారం గ్రామాల మధ్యవాహనాలను తనిఖీ చేస్తుండగా , మంగలికుంట గ్రామంలోనూ వీటిని గుర్తించినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీకి వినియోగించేందుకు వీటిని వినియోగిస్తారని పేర్కొన్నారు.

## రాష్ట్రానికి కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటం గర్వకారణం : ఎంఐఎం



**హైదరాబాద్, ఆగస్ట్6 (తెలుగుప్రభ)**

తెలంగాణ రాష్ట్ర సమ్మిళిత, సమీకృత, సామరస్య అభివృద్ధి దేశానికి రోల్ మోడల్ అని ఎంఐఎం శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తొమ్మిదేండ్ల కాలంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని చెప్పారు. శాసనసభలో తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు – స్వరాష్ట్రంలో సాధించిన ప్రగతిపై అక్బరుద్దీన్ ఒవైసీ లఘుచర్చను ప్రారంభించారు. జైపూర్ రైలు ఘటనలో చనిపోయిన హైదరాబాద్ యువకుడికి ప్రభుత్వం అండగా నిలిచిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ చర్య దేశానికి గొప్ప సందేశం పంపిందని చెప్పారు. ఇందుకుగాను రాష్ట్ర సర్కారుకు, ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు అందిస్తున్నదని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన మంచినీరు అందిస్తోందని చెప్పారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని అన్ని రాష్ట్రాలు చూసి నేర్చుకోవాలన్నారు. రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఉండటం గర్వంగా భావిస్తున్నానని చెప్పారు.